E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 21-06-2025 (వారం) శనివారం

హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



మణికొండలో నక్షత్ర తాబేళ్లను విక్రయించే ప్రయత్నం » 3లో

## ఆరోగ్య సమాజానికి మహాయజ్ఞం



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025కు సర్వం సిద్ధం చేశారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహాప్రదర్శనకు విశాఖ సాగరతీరం ముస్తాబైంది.

**'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం**

**ముఖ్య అతిథిగా మోదీ**

**అద్భుత ఘట్టానికి ముస్తాబైన సాగరతీరం**

**విశాఖ వేదికగా నేడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం**

ఈ కబురు, విశాఖపట్నం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర2025కు సర్వం సిద్ధం చేశారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మహాప్రదర్శనకు విశాఖ సాగరతీరం ముస్తాబైంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు లక్షల మంది ఒకే మార్గంలో యోగాసనాలు వేయడానికి అనువుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పచ్చటి తివాచీపై సముద్రతీరంలో 3.26 లక్షల మంది పాల్గొనేలా అన్ని సౌకర్యాలూ కల్పించారు. 29 కి.మీ. మేర ఏర్పాటుచేసిన 326 కంపార్ట్‌మెంట్లను సీఎస్ విజయానంద్ పరిశీలించారు. శుక్రవారం సాయంత్రానికి ఏడు రక్షణ నౌకలను తీరంలో నిలిపి ఉంచారు. ఏయూ మైదానంతో పాటు గోల్ఫ్ క్లబ్, పీఎంపాలెం క్రికెట్ స్టేడియం, పోర్టు స్టేడియం, రైల్వే ఎగ్జిబిషన్ మైదానం, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం సహా 18 క్రీడా మైదానాల్లో యోగాసనాలు వేయనున్నారు.

తరువాయి 2లో

## కాళేశ్వరం'లోని ఆ మూడు బ్యారేజీలను పక్కనపెట్టండి



తరువాయి 2లో

## కుమురం భీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వు రద్దు చేయాలి: తమ్మినేని వీరభద్రం




తరువాయి 2లో

## చర్చలపై భేషజాల్లేవ్



**"ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరి-బనకచర్ల సమస్య పరిష్కారమవుతుంది. ఇలా చర్చించుకోవడంలో మాకేమీ భేషజాలు లేవు. అలాగని తెలంగాణ హక్కులను కోల్పోవడానికి సిద్ధంగా లేం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.**

**అవసరమైతే ఏపీ సీఎంను మేమే ఆహ్వానిస్తాం..**

**అదే సమయంలో తెలంగాణ హక్కులను వదులుకోం**

**23న మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం**

**బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ**

**సమస్యకు మూలకారణం కేసీఆర్, హరీశ్‌రావులేనని ఆరోపణ**

**భాజపాకు భారాస 'అవయవదానం'లా సీట్లిచ్చిందని విమర్శ**

**అందుకే కిషన్‌రెడ్డి కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారని ఎద్దేవా**

విభజన చట్టం ప్రకారం గోదావరిపై పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే అనుమతులున్నాయి. దానికి ఏ మార్పులు చేసినా తెలంగాణ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. బనకచర్ల పోలవరానికి అనుబంధంగా నిర్మిస్తున్నందున మా అనుమతి తప్పనిసరి.

ఈ కబురు,, దిల్లీ: ''ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరిబనకచర్ల సమస్య పరిష్కారమవుతుంది. ఇలా చర్చించుకోవడంలో మాకేమీ భేషజాలు లేవు. అలాగని తెలంగాణ హక్కులను కోల్పోవడానికి సిద్ధంగా లేం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన దిల్లీలోని తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టింది మాజీ సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావులేనని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా సరిపోతుందని 2015లో లేఖ ఇచ్చింది హరీశ్‌రావేనని, గోదావరి వరద నీటిని పెన్నా పరీవాహక ప్రాంతానికి తరలించడానికి అభ్యంతరం లేదంటూ 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పింది కేసీఆరేనని ధ్వజమెత్తారు. అందుకు సంబంధించిన లేఖలు, మీటింగ్ మినిట్స్‌ను రేవంత్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు.


తరువాయి 2లో



జైస్వాల్, శుభ్‌మన్ సెంచరీలు.. మొదటి రోజు భారత్‌దే ఆధిపత్యం » 6లో



ఇండస్ట్రీలో ఇదే జరుగుతోంది.. ఆ బ్రేకప్ వల్ల మూడేళ్లపాటు బాధలోనే.. » 5లో



యాపిల్.. ఫేస్‌బుక్.. గూగుల్.. 16 బిలియన్ల పాస్‌వర్డ్‌లు లీక్! » 4లో

## ట్రంప్ అమెరికా ఆహ్వానాన్ని తిరస్కరించా



వాషింగ్టన్‌ను సందర్శించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు ప్రధాన మోదీ వెల్లడించారు. వివిధ అంశాలపై వాషింగ్టన్‌లో చర్చించుకుందామని, కలిసి లంచ్ చేద్దామని ట్రంప్ తెలిపారన్నారు.

తరువాయి 2లో

ఈ కబురు ,భువనేశ్వర్: వాషింగ్టన్‌ను సందర్శించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు ప్రధాన మోదీ వెల్లడించారు. వివిధ అంశాలపై వాషింగ్టన్‌లో చర్చించుకుందామని, కలిసి లంచ్ చేద్దామని ట్రంప్ తెలిపారన్నారు. ఇటీవల జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారని మోదీ పేర్కొన్నారు.

## అంధ విద్యార్థుల పాట విని.. పుట్టినరోజున రాష్ట్రపతి ముర్ము కంటతడి



తరువాయి 2లో

## ఆనందమయ జీవితానికి యోగా

**ఆరోగ్యంగా ఆనందమయ జీవితం గడపడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని వక్తలు తెలిపారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం యోగా అని, ప్రధాని మోదీ చొరవతో అన్ని దేశాలు యోగా దినోత్సవాన్ని జరుపుకొంటున్నాయని పేర్కొన్నారు.**



ఈ కబురు, హైదరాబాద్: ఆరోగ్యంగా ఆనందమయ జీవితం గడపడానికి యోగా ఎంతో దోహదం చేస్తుందని వక్తలు తెలిపారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప వరం యోగా అని, ప్రధాని మోదీ చొరవతో అన్ని దేశాలు యోగా దినోత్సవాన్ని జరుపుకొంటున్నాయని పేర్కొన్నారు. ఒత్తిడి, ఆందోళనతో సతమతమవుతోన్న ప్రస్తుత యువత వారి దినచర్యలో దీన్ని భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒకరోజు ముందుగా '24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలు' పేరుతో శుక్రవారం ఉదయం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ ఈటల రాజేందర్, సినీ నటి, భాజపా నేత కుష్బు, నటీనటులు మీనాక్షిచౌదరి, సాయిదుర్గాతేజ్, తేజ సజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'యోగాతో యోగ్యులవుతారు. మానసికంగా, శారీరకంగా సమతుల్యం సాధిస్తారు. ప్రస్తుతం ఎంతోమంది పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. అన్ని సమస్యలకు ఇది పరిష్కారంగా పనిచేస్తుంది. దీనికి ప్రత్యేకంగా జాతి, మతం లేదు. ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా జీవితంలో భాగం చేసుకోవాలి' అని సూచించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ 'యోగా అంటే శారీరక వ్యాయామం మాత్రమే కాదు. అదొక జీవన ప్రమాణం. శాంతి, క్రమశిక్షణతో కూడిన జీవనానికి యోగా ఎంతో అవసరం. శరీరం, మనసు, ఆత్మను అనుసంధానం చేసే అద్భుత సాధనం. భారత్‌లో పుట్టిన యోగా.. సరిహద్దులు, సంస్కృతి, సంప్రదాయాలను దాటి ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది' అని తెలిపారు.

తరువాయి 2లో



## ఉక్రెయిన్ నగరాలపై రష్యా డ్రోన్ దాడులు

**ప్రత్యక్ష శాంతి చర్చలకు వచ్చే వారం తేదీల ఖరారు దిశగా కసరత్తు**

**కొనసాగుతుండగానే గురువారం రాత్రి ఉక్రెయిన్‌లోని రెండు నగరాలపై రష్యా డ్రోనులు విరుచుకుపడ్డాయి.**

» 3లో



## ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదు.. విద్యార్థుల అభివృద్ధికి ఊతం

**ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదని, విద్యార్థుల సాధికారతకు అది చిహ్నం అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రతి చిన్నారికి కచ్చితంగా ఆంగ్ల భాషను నేర్పించాలని తెలిపారు.**

» 3లో

## గోదావరికి ప్రాణహిత తర్వాత ఇంద్రావతే ప్రధాన వనరుగా ఉన్న వైనం

**గోదావరి ఉపనది జలాల గరిష్ట వినియోగానికి ఛత్తీస్‌గఢ్ రెడీ**

**బోద్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు శ్రీకారం..కేంద్రం అనుమతి!**

**తెలంగాణ ప్రాజెక్టులకు నీటి లభ్యత కష్టమే అంటున్న నిపుణులు**

**గోదావరిలో ఇంద్రావతి కలిసే ప్రాంతానికి దిగువనే దేవాదుల, సీతారామ, సమ్మక్క–సారక్క**

**వీటికి దిగువన ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం**

**ఈ నదిలో ఏటా సుమారు 600–800 టీఎంసీల మేర లభ్యత**

**రూ.49 వేల కోట్లతో సుమారు 9.45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు**



ఈ కబురు, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు జీవనాడిగా ఉన్న గోదావరి నదికి ప్రాణహిత తర్వాత ప్రధాన ఉపనది అయిన ఇంద్రావతి నీటిని పూర్తిగా కట్టడి చేసేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇంద్రావతిలో లభ్యతగా ఉన్న నీటిలో మెజా రిటీ జలాలను వినియోగించుకునేలా బోద్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తోంది. ఇటీవలే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం అనుమతినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు.

ఇంద్రావతి నీటినే నమ్ముకొని తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు చేపడుతుండటం గమనార్హం. కాగా ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ తెరపైకి తెచ్చిన ఈ ప్రాజెక్టుతో దిగువ గోదావరిలో జలాల లభ్యత తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ వినియోగించని జలాలనే ఆధారంగా చేసుకుని కేంద్రం గోదావరి-కావేరి అనుసంధానాన్ని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే.

ఎగువ నీళ్లకు ఎగువనే అడ్డుకట్ట..

ఇంద్రావతిలో ప్రతి ఏటా సుమారు 600-800 టీఎంసీల మేర లభ్యత ఉంటుందని కేంద్రం లెక్కలు చెబుతున్నాయి. ఇది ఛత్తీస్‌గఢ్‌లో 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మేడిగడ్డ దిగువన, సమ్మక్క-సారక్క బరాజ్ ఎగువన గోదావరిలో కలుస్తుంది. దంతెవాడ, బీజాపూర్, సుక్మా, బస్తర్, కాంకేర్ జిల్లాల గుండా ప్రవహిస్తుంది. ఆయా జిల్లాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుల్లోనే ఉన్నాయి.

తరువాయి 3లో



## ఇరాన్‌పైకి దూసుకెళ్లిన 60 యుద్ధ విమానాలు

**అటు ఇజ్రాయెలూ తగ్గడం లేదు. ఇటు ఇరానూ వెనుకడుగు వేయడం లేదు. సై అంటే సై అంటున్నాయి. యుద్ధం ఎనిమిదో రోజైన శుక్రవారం పరస్పర దాడుల తీవ్రతను మరింత పెంచాయి.**

» 3లో

# మణికొండలో నక్షత్ర తాబేళ్లను విక్రయించే ప్రయత్నం



పట్టుబడిన అరుదైన తాబేళ్లు

## వ్యక్తి అరెస్టు - అరుదైన తాబేళ్లు స్వాధీనం

ఈ-కబురు, శేరిలింగంపల్లి : నిబంధనలకు విరుద్ధంగా నక్షత్ర తాబేళ్లు, రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లు విక్రయిస్తున్న ముఠా గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు. రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని మణికొండలో చోటుచేసుకున్న ఈ కేసులో ఓ నిందితుడిని అరెస్టు చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసుల కథనం ప్రకారం... మణికొండకు చెందిన చెరుకుల బాలస్వామి(40) మణికొండ సాయిరాం నగర్ కాలనీలో న్యూ బ్లే స్టార్క్ ఆక్వేరియం షాప్ నిర్వహిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించడం కోసం తాబేళ్ల స్మగ్లింగ్ చేపట్టాడు. చెన్నైకి చెందిన స్నేహితుడు సురేష్ కుమార్ వద్ద అరుదైన తాబేళ్లు తెచ్చి నగరంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచాడు. ఈ విషయమై విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుసుకున్న ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు శుక్రవారం దాడి చేశారు. బాలస్వామి వద్ద నుంచి నాలుగు నక్షత్ర తాబేళ్లు, రెండు రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాలస్వామి కి నోటీసులు జారీ చేశామని, పట్టుబడిన తాబేళ్లను అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. తాబేళ్లను సరఫరా చేసిన సురేష్ కుమార్ పరారీలో ఉన్నాడని, కేసును ఫారెస్టు విభాగానికి బదిలీ చేస్తామని పోలీసులు తెలిపారు.



# ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదు.. విద్యార్థుల అభివృద్ధికి ఊతం



రాహుల్ గాంధీ వ్యాఖ్య

ఈ కబురు,దిల్లీ: ఆంగ్ల భాష సిగ్గుచేటు కాదని, విద్యార్థుల సాధికారతకు అది చిహ్నం అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రతి చిన్నారికి కచ్చితంగా ఆంగ్ల భాషను నేర్పించాలని తెలిపారు. త్వరలోనే దేశంలో ఆంగ్లం మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం రాహుల్ స్పందించారు. ''ఆంగ్లం డ్యామ్ లాంటిది కాదు..అది ఒక వంతెన. సిగ్గుచేటు కాదు...సాధికారత కల్పించే ఆయుధం. సమస్య కాదు. అడ్డంకులను బద్దలుగొట్టగలిగే సాధనం'' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పేదలు ఉన్నత చదువులు చదువుకుని.. సమానత్వాన్ని సాధించడం భాజపా, ఆరెస్సెస్‌లకు ఇష్టం లేదని విమర్శించారు. అందుకే వారిని విద్యకు దూరం చేయాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి మాతృభాష ఎంత ముఖ్యమో.. ఆంగ్ల భాష కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రతి భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని మనం గౌరవించాలన్నారు. అదే సమయంలో ప్రపంచంతో పోటీ పడడానికి వీలుగా ప్రతి చిన్నారికి ఆంగ్ల విద్యను బోధించాలని సూచించారు. ఆంగ్లం ఉపాధిని కల్పిస్తుందని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు.

## నీటిపారుదల శాఖ ఈఎన్సి అనిల్ కుమార్ బదిలీ వేటు

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల శాఖ ఈఎన్సి అనిల్ కుమార్ బదిలీ వేటు పడింది. ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జా అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, మేడిగడ్డ ఆనకట్ట గ్రౌటింగ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అనిల్ కుమార్‌పై బదిలీ వేటువేసినట్లు సమాచారం. ఏసీబీ దాడిలో అరెస్ట్ అయిన ఈఈ శ్రీధర్ విషయంలో కలగజేసుకున్నారని అనిల్‌పై ఆరోపణలు ఉన్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలలో బుంగలు పూడ్చాడని (గ్రౌటింగ్)అనిల్‌పై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఎవరి ఆదేశాల మేరకు గ్రౌటింగ్ చేశారని అనిల్ కుమార్‌పై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం తాజాగా చర్యలకు ఉపక్రమించింది. నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా మెమో జారీ చేసినట్లు సమాచారం.

# ఇరాన్‌పైకి దూసుకెళ్లిన 60 యుద్ధ విమానాలు



టెల్ అవీవ్/టెహ్రాన్: అటు ఇజ్రాయెలూ తగ్గడం లేదు. ఇటు ఇరానూ వెనుకడుగు వేయడం లేదు. సై అంటే సై అంటున్నాయి. యుద్ధం ఎనిమిదో రోజైన శుక్రవారం పరస్పర దాడుల తీవ్రతను మరింత పెంచాయి. ఒకవైపు యుద్ధం ఆపడానికి జెనీవాలో చర్చల ప్రక్రియ ప్రారంభమైనా.. రెండు దేశాలు బాంబుల వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నాయి. టెల్ అవీవ్, హైఫా, బీర్‌షిబా నగరాలపై బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. ముఖ్యంగా బీర్‌షిబాలోని టెక్నాలజీ పార్కుపై దాడి చేసింది. ఈ ఘటనలో పలు భవనాలకు నష్టం వాటిల్లింది. మైక్రోసాఫ్ట్ కార్యాలయం సమీపంలో మంటలు ఎగసిపడ్డాయి. ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన కీలక కార్యాలయాలు ఆ పార్కులో ఉన్నట్లు తెలుస్తోంది. హైఫా నగరంపై ఇరాన్ చేసిన మిసైల్ దాడిలో 23 మందికి గాయాలయ్యాయి. మరోవైపు రాజధాని టెహ్రాన్, ఇరాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై 60కు పైగా యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ రక్షణ పరిశోధనా సంస్థ కేంద్ర కార్యాలయానికీ నష్టం కలిగించింది. పశ్చిమ ఇరాన్‌లోని కెర్మన్‌షా, తబ్రీజ్ ప్రాంతాలలో ఉన్న బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు చేసింది. కాస్పియన్ సముద్రం సమీపంలో ఉన్న రాస్త్ నగరం పైనా బాంబులు వేసింది. ఐరోపా నేతలతో భేటీ: ఇరాన్‌పై దాడి చేయాలా లేదా అనే విషయంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం పేర్కొన్న నేపథ్యంలో ఐరోపా నేతలతో సమావేశం అవ్వడానికి ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం జెనీవా చేరుకున్నారు. అక్కడ అనేక గంటలపాటు ఐరోపా, ఇరాన్ నేతల మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్ని మరింతగా కొనసాగించాలని ఐరోపా నేతలు అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. అదే సమయంలో ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండరాదని స్పష్టంగా చెప్పినట్లు బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లామీ తెలిపారు. అంతకుముందు అబ్బాస్ అరాగ్చీ విలేకరులతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ దాడులు ఆపనంతవరకు అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ''చర్చలు జరపాలని అమెరికన్లు కోరుకుంటున్నారు. చాలా సందేశాలు పంపారు. దాడులు ఆపనంతవరకు చర్చల ప్రసక్తే లేదని వారికి స్పష్టం చేశాం'' అని చెప్పారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా టెహ్రాన్, బీరుట్, బాగ్దాద్‌లో భారీ ప్రదర్శనలు జరిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో అరాక్ నగరంలో నిర్మాణంలో ఉన్న అణుకేంద్రానికి భారీగా నష్టం వాటిల్లిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తెలిపింది. కీలక భవనాలు దెబ్బతిన్నాయని పేర్కొంది. ఇజ్రాయెలీ యుద్ధ విమానాలు గురువారం అరాక్ భారజల రియాక్టర్‌పై బాంబుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.



# ఉక్రెయిన్ నగరాలపై రష్యా డ్రోన్ దాడులు

**ప్రత్యక్ష శాంతి చర్చలకు వచ్చే వారం తేదీల ఖరారు దిశగా కసరత్తు కొనసాగుతుండగానే గురువారం రాత్రి ఉక్రెయిన్‌లోని రెండు నగరాలపై రష్యా డ్రోనులు విరుచుకుపడ్డాయి.**

### శాంతి చర్చలకు వచ్చే వారం తేదీల ఖరారు: క్రెమ్లిన్

ఈ కబురు,కీవ్: ప్రత్యక్ష శాంతి చర్చలకు వచ్చే వారం తేదీల ఖరారు దిశగా కసరత్తు కొనసాగుతుండగానే గురువారం రాత్రి ఉక్రెయిన్‌లోని రెండు నగరాలపై రష్యా డ్రోనులు విరుచుకుపడ్డాయి. దక్షిణ ఉక్రెయిన్‌లోని నౌకా నగరమైన ఒడెసా, ఈశాన్య ప్రాంత నగరమైన ఖర్కీవ్‌లోని పలు అపార్టుమెంట్లు ఈ దాడుల్లో ధ్వంసమయ్యాయి. ఈ ఘటనల్లో ఒకరు మృతి చెందారని, 25 మందికిపైగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. కాల్పుల విరమణకు అంగీకరించేలా చేసేందుకు రష్యాపై ఆర్థికపరమైన ఆంక్షలను మరింత తీవ్రం చేయాలని అమెరికా, ఐరోపా దేశాలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉండగా...రెండు దేశాల మధ్య ప్రత్యక్ష శాంతి చర్చలకు తేదీల ఖరారు వచ్చే వారం జరిగే అవకాశం ఉందని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ శుక్రవారం తెలిపారు.

# గోదావరికి ప్రాణహిత తర్వాత ఇంద్రావతే ప్రధాన వనరుగా ఉన్న వైనం



ఈ కబురు, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు జీవనాడిగా ఉన్న గోదావరి నదికి ప్రాణహిత తర్వాత ప్రధాన ఉప నది అయిన ఇంద్రావతి నీటిని పూర్తిగా కట్టడి చేసేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇంద్రావతిలో లభ్యతగా ఉన్న నీటిలో మెజా రిటీ జలాలను వినియోగించుకునేలా బోద్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తోంది. ఇటీవలే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం అనుమతినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు. ఇంద్రావతి నీటినే నమ్ముకొని తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు చేపడుతుండటం గమనార్హం. కాగా ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ తెరపైకి తెచ్చిన ఈ ప్రాజెక్టుతో దిగువ గోదావరిలో జలాల లభ్యత తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ వినియోగించని జలాలనే ఆధారంగా చేసుకుని కేంద్రం గోదావరి–కావేరి అనుసంధానాన్ని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే.

### ఎగువ నీళ్లకు ఎగువనే అడ్డుకట్ట..

ఇంద్రావతిలో ప్రతి ఏటా సుమారు 600–800 టీఎంసీల మేర లభ్యత ఉంటుందని కేంద్రం లెక్కలు చెబుతున్నాయి. ఇది ఛత్తీస్‌గఢ్‌లో 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మేడిగడ్డ దిగువన, సమ్మక్క–సారక్క బరాజ్ ఎగువన గోదావరిలో కలుస్తుంది. దంతెవాడ, బీజాపూర్, సుక్మా, బస్తర్, కాంకేర్ జిల్లాల గుండా ప్రవహిస్తుంది. ఆయా జిల్లాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుల్లోనే ఉన్నాయి.

ఇంద్రావతి నీళ్లు కలిశాకే గోదావరి దిగువన ప్రవాహాలు మరింత ఉధృతంగా ఉంటాయి. కాగా ఇంద్రావతి నది గోదావరిలో కలిసే ప్రాంతానికి దిగువన, గరిష్ట నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ.. దేవాదుల (38 టీఎంసీలు), సీతారామ (70 టీఎంసీలు), సమ్మక్క–సారక్క (50 టీఎంసీలు మొత్తంగా 158 టీఎంసీలు) ప్రాజెక్టులు చేపట్టింది. ఇక ఏపీలో పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. ఇలావుండగా ఇంద్రావతిలో లభ్యత నీటిని ఛత్తీస్‌గఢ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోవడంతో.. ఈ నీటిని మిగులు జలాలుగా గుర్తించిన కేంద్రం.. నదుల అనుసంధాన ప్రతిపాదనలు చేసింది. ఇంద్రావతి బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ (అప్పటి మధ్యప్రదేశ్)కు గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన నీటిలో వాడుకోని 141.4 టీఎంసీలకు మరో 106 టీఎంసీల వరద జలాలను జతచేసి మొత్తం 247 టీఎంసీలను ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్–సోమశిల మీదుగా కావేరి గ్రాండ్ ఆనకట్ట వరకు తరలించేలా నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

అయితే గోదావరిలో మిగులు, వరద జలాల నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చేవరకు అనుసంధానం పక్కన పెట్టాలని తెలంగాణ, ఏపీలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. దీంతో తొలిదశ కింద ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలనే గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి నుంచి నీటిని తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఆవిరి, ప్రవాహ నష్టాలు పోను ఏపీకి 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ప్రతిపాదించింది. దీనిపై ఛత్తీస్‌గఢ్ సర్కార్ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

### చెప్పినట్టే చేస్తున్న ఛత్తీస్‌గఢ్

తమకు హక్కుగా సంక్రమించిన నీటిని తరలించుకు పోతామంటే ఒప్పకునేది లేదని, భవిష్యత్తులో ఈ నీటిని వినియోగించుకునేలా తాము ప్రాజెక్టులు చేపడతామని ఛత్తీస్‌గఢ్ తెగేసి చెప్పింది. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బోద్‌ఘాట్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్రం ముందుంచింది.

ఈ ప్రాజెక్టు కింద ఇందావ్రతి నీటిని ఒడిసిపట్టేలా రూ.29 వేల కోట్లతో బోద్‌ఘాట్ ఆనకట్టని, అదనంగా మరో రూ.20 వేల కోట్లతో మహానది–ఇంద్రావతి లింక్‌ను చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 300 మెగావాట్ల విద్యుదుత్పత్తితో పాటు దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాల్లోని 359 గ్రామాల పరిధిలోని 3.78 లక్షల హెక్టార్లకు (9.45 లక్షల ఎకరాలకు) సాగునీటిని అందించాలని నిర్ణయించింది. అదనంగా తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటిని ఇచ్చేలా ప్రణాళికలు ఉన్నాయి.

### గోదావరి–కావేరి అనుసంధానం కూడా ప్రశ్నార్థకమే..!

ఇంద్రావతి మెజారిటీ జలాలను ఛత్తీస్‌గఢ్ వినియోగించుకునే పక్షంలో గోదావరి నుంచి తెలంగాణ, ఏపీ ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గడం ఖాయమని నీటి పారుదల నిపుణులు అంటున్నారు. అలాగే కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధానం కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు. కాగా దీనిపై తెలుగు రాష్ట్రాలు ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# డెత్ స్పాట్ గా సీక్రెట్ లేక్..

## కేబుల్ బ్రిడ్జి పైనుంచి దుర్గం చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

## అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులే కారణం


దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జీ


ఆత్మహత్య చేసుకున్న సుష్మ (ఫైల్)


దుర్గం చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది

ఈ-కబురు, శేరిలింగంపల్లి : హైటెక్ సిటీలో చిన్న చిన్న గుట్టల మధ్యగా... కిలోమీటర్ల పొడవు విస్తరించి.. సీక్రెట్ లేక్ గా పేరుగాంచిన దుర్గం చెరువు డెత్ స్పాట్ గా మారుతుంది. దుర్గం చెరువు అందాలను విశ్వవ్యాప్తం చేసేందుకు కేబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రభుత్వం టూరిస్ట్ స్పాట్ గా మార్చగా, కొందరు మాత్రం కేబుల్ బ్రిడ్జిని ఆత్మహత్యలకు కేంద్రంగా మార్చుకుంటున్నారు. కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన నాటి నుంచి తరచూ క్రమం తప్పకుండా ఆత్మహత్యల సంఘటనలు చోటుచేసుకోవడం విషాదాన్ని నింపుతుంది. తాజాగా అదనపు కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ మహిళ కేబుల్ బ్రిడ్జి మీద నుంచి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన కు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన అంజయ్య కుమార్తె బి. సుష్మ(27)కు నెరేడ్‌మెట్‌కు చెందిన గొల్లూరు ఆనంద్, పాలిన దంపతుల కుమారుడు అమృత్‌తో 2025 జనవరి 31వ తేదిన వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం కింద 6 తులాల బంగారం, ఒప్పుకున్న 6లక్షల నగదులో 5.50 లక్షలు ఇచ్చారు. అమృత్ హైటెక్‌సిటీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, సుష్మ మాదాపూర్ ఇనార్బిట్ మాల్ రోడ్డులోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. గత కొద్ది రోజులుగా అదనపు కట్నం తీసుకురావాలని సుష్మను భర్త అమృత్, అత్తమామలు ఆనంద్, పాలిన, మరిది జ్యోతిరాజ్ వేధింపులకు గురిచేశారు. కట్నం విషయమై సుష్మకు అత్తమామలతో గొడవలు జరిగాయి. ఇటీవల సుష్మకు ఆరోగ్యం బాగలేకపోవడంతో గత శని, ఆదివారం ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని సోమవారం అడ్డగుట్టలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రుల వద్ద ఉన్న సుష్మ ఈ నెల 18వ తేదిన సాయంత్రం 3 గంటలకు ఆఫీస్‌కు వెళ్తున్నాని ఇంట్లో నుండి బయటకు వచ్చింది. అఫీస్‌కు చేరుకున్న సుష్మ రాత్రి 8. 30 గంటలకు బయటకు వెళ్లింది. అక్కడి నుండి కేబుల్ బ్రిడ్జి మీదకు చేరుకొని దుర్గం చెరువులోకి దూకింది. రాత్రి1 గంట ప్రాంతంలో ఇంటికి రావలసిన సుష్మ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అఫీస్ మేనేజర్‌కు తండ్రి ఫోన్ చేసి వాకబు చేయగా, రాత్రి 8.30 గంటలకే అఫీస్ నుండి బయటకు వెళ్లిందని తెలియజేశాడు. దీంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద సుష్మ అచూకీ కోసం వెతికిన తల్లిదండ్రులు ఫలితం లేకపోవడంతో గురువారం తెల్లవారుజామున మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఉదయం 7 గంటల సమయంలో దుర్గం చెరువు నీటిపై యువతి మృతదేహం తేలియాడుతుండడంతో స్థానికులు గమనించి మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో యువతి మృతదేహాన్ని చెరువు నుండి బయటకు తీసి చూడగా, మృతురాలిని మిస్సింగ్ అయిన సుష్మగా గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుష్మ భర్త అమృత్, తల్లిదండ్రులు ఆనంద్ పాలిన, మరిది జ్యోతిరాజ్ లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


చిన్నారులతో కలిసి వేడుకల్లో చంద్రికా ప్రసాద్

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్న దేశ ప్రజలు : చంద్రికా ప్రసాద్ గౌడ్**

ఈకబురు, శేరిలింగంపల్లి : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్ లో ఘనంగా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షురాలు పి.చంద్రికా ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో మియాపూర్ ఓంకార్ నగర్ వికర్ సెక్షన్ కాలనీలో ఉన్న స్వచ్ఛంద సంస్థ స్కూల్ లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంద్రికా ప్రసాద్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను ఓంకార్ నగర్ స్కూల్లో జరుపుకోవడం ఆనందంగా ఉందని ఈ స్కూల్ ఆర్థికంగా అత్యంత వెనుకబడిన చిన్నారులు చదువుకుంటున్నారని అన్నారు. నేడు దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. సంక్షేమానికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు.

# సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై కేసు..

**ప్లాట్ల యజమానులపై దాడి ఘటనలో గచ్చిబౌలి పోలీసుల చర్యలు**

**శ్రీధర్ రావు, అనుచరుడు వెంకటేష్, మరో ముగ్గురిపై కేసులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీసు స్టేషన్ లో మరో కేసు నమోదైంది. ఎఫ్సీఐ లే ఔట్ ప్లాట్ల యజమానులను బెదిరించి దాడి చేసిన ఘటనలో ప్లాట్ల యజమానుల పిర్యాదు మేరకు పోలీసులు శ్రీధర్ రావుతో పాటు అతని అనుచరుల మీద కేసు నమోదు చేశారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నెంబర్ 124,125లలో ఉన్న ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా హౌసింగ్ సొసైటీలో ఈ నెల 17వ తేదీన హైడ్రా అధికారులు సర్వే, రహదారుల మార్కింగ్ పనులు చేపట్టారు. మణికొండలో నివాసం ఉండే కుషిచంద్ వడ్డే(40)కు ఈ లే ఔట్ లో ప్లాట్ ఉంది. సర్వే విషయమై హైడ్రా అధికారులు కుషిచంద్ వడ్డేకు సమాచారం అందించారు. దీంతో కుషిచంద్ ఎఫ్‌సీఐ లేఔట్ వద్దకు చేరుకున్నాడు. సర్వే సమయంలో సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు, అతని అనుచరుడు వెంకటేష్ అక్కడే ఉన్నారు. ప్లాట్ల కబ్జా విషయమై కుషిచంద్ గతంలో శ్రీధర్ రావు మీద పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సర్వే వద్ద కుషిచంద్ ను చూసిన శ్రీధర్ రావు అనుచరుడు వెంకటేష్‌కారుతో స్పీడ్‌గా దూసుకువచ్చి కుషిచంద్ ను ఢీకొట్టేందుకు యత్నించగా, వెంటనే స్పందించిన కుషిచంద్ కారు దిగి తప్పించుకున్నాడు. వెంకటేష్ కారు దిగి వచ్చి కుషిచంద్ ను బూతులు తిడుతూ మొఖంపై పిడిగుద్దుల వర్షం కురిపించాడు. సంఘటన స్థలంలో ఉన్న హైడ్రా అధికారులు, ఇతర ప్లాట్ల యజమానులు వారిని వారించారు. హైడ్రా అధికారుల సూచన మేరకు కుషిచంద్ అక్కడి నుండి తన కారులో బయటకు వెళ్లిపోయారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత వెంకటేష్ , మరో ముగ్గురు వ్యక్తులు బైకులపై కుషిచంద్ కారును వెంబడించి, కారులో నుంచి బయటకు లాగే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత రాళ్లతో దాడి చేసి బెదిరించారు. దీంతో కుషిచంద్ తనపై జరిగిన దాడిపై గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశాడు. శ్రీధర్‌రావు నుండి తనకు ప్రాణహానీ ఉందని, తనపై దాడికి పాల్పడ్డ వెంకటేష్, మరో ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు, వెంకటేష్ ,సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో ఎఫ్ సీఐ లే ఔట్ లో సర్వే వద్దకు వచ్చిన నటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంత్ మీద శ్రీధర్ రావు అనుచరులు దాడి చేయడంతో నటి రమ్యశ్రీ గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేసింది. దీనితో గచ్చిబౌలి పోలీసులు ఈ ఘటనపై సైతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి: అమిత్ షా

**ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవని అమిత్ షా పేర్కొన్నారు.**

ఈ కబురు: విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు.''ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలి'' అని అమిత్ షా పిలుపునిచ్చారు.మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.



# ముదురుతున్న యుద్ధం.. ఇరాన్ నోట 'హర్మూజ్' మూసివేత ప్రస్తావన

ఈ కబురు: ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ జలసంధిని కూడా మూసివేసే ఆప్షన్ తమ వద్ద ఉందని వెల్లడించింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ జలసంధిని మూసివేయడం కూడా ఓ మార్గమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నాం సయీదీ గురువారం మీడియాకు తెలిపారు. పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఒత్తిడి చేసిన సమయంలో గతంలోనూ హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ బెదిరించింది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు హర్మూజ్ జలసంధి జీవనాడి. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పంఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒకవంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో రష్యా స్పందించింది. తక్షణమే దాడులను ఆపాలని ఆ దేశానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రష్యా విదేశాంగశాఖ మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌లోని బుషెహర్ ప్రాంతంలో ఈ అణు విద్యుత్ కేంద్రం ఉంది. ఇరాన్ ఏర్పాటు చేసుకున్న ఒకే ఒక వాణిజ్య స్థాయి అణు విద్యుత్ కేంద్రమిది. ఇది టెహ్రాన్ నగరానికి 750 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని నిర్మాణంలో ఇరాన్‌కు రష్యా సాయమందించింది. రష్యాలో ఉత్పత్తి అయిన యురేనియం ఈ అణు విద్యుత్ కేంద్రానికి ఇంధనంగా ఉపయోగపడుతోంది.

# యూఎస్ కాన్సులేట్ ముందు వామపక్ష పార్టీల ఆందోళన


వామపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఆపాలని డిమాండ్**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని యూఎస్ కాన్సులేట్ ముందు వామపక్ష పార్టీలు గురువారం ఆందోళనకు ప్రయత్నించాయి. ఇజ్రాయిల్ చేపడుతున్న మారణ హోమ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు యూఎస్ కాన్సులేట్ ముందు నిరసనకు పిలుపునిచ్చాయి ఈ మేరకు గురువారం మధ్యాహ్నం పలు వామపక్ష పార్టీల సభ్యులు యూఎస్ కాన్సులేట్ వద్దకు చేరుకోగా పోలీసులు అడ్డుకొని నార్సింగి పోలీస్ స్టేషన్ కు తరలించారు. సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యుసిఐ(సి) రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(ఎంఎల్)' వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనకు ప్రయత్నం చేశారు. వామపక్ష పార్టీల పిలుపుతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు నిరసన చేపట్టేందుకు వచ్చిన నాయకులను అరెస్టు చేసి పలు పోలీసు స్టేషన్ల కు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి పద్మ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, ఏం సిసీపీఐ నాయకులు అనీల్ లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. అమెరికా యుద్ధకాంక్షతో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇజ్రాయిల్ ఇరాక్ మధ్య జరుగుతున్న మారణహోమ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.


వామపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు




# ఆస్పత్రిపై దాడి.. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేస్తే భారత్‌పై భారం?

**ఈ కబురు: తాజాగా ఇజ్రాయెల్‌లోని సొరొకా ఆస్పత్రిపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో 240 మంది వరకు గాయాలపాలైనట్లు సమాచారం. అయితే తాము ఆస్పత్రిని టార్గెట్ చెయ్యలేదని, దానికి సమీపంలో ఉన్న మిలిటరీ స్థావరాన్ని టార్గెట్ చేశామని ఇరాన్ తెలిపింది. ఈ ఆస్పత్రిలో ఉపయోగంలో లేని పాత సర్జరీ విభాగంపై మిసైల్స్ పడటంతో ఎవరూ చనిపోలేదని సమాచారం.**

ఈ ఘటనతో ఇరాన్‌పై దాడుల తీవ్రత పెంచుతామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. ఇదే సమయంలో ఇరాన్ లొంగిపోతే మంచిదని యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా సూచించారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పిచ్చి మాటలు తామెప్పుడూ వినలేదని, ఇరాన్ లొంగిపోవడం జరగదని ఆ దేశాధినేత తేల్చిచెప్పారు. అదే సమయంలో పరిస్థితి తీవ్రతరం అయితే హోర్ముజ్ జలసంధిని మూసేయాలనే ఆలోచనలో ఇరాన్ ఉన్నట్లు ఆ దేశనేత బెహనామ్ సయీదీ వెల్లడించారు. ప్రతిరోజూ ప్రపంచం ఉపయోగించే చమురు నిల్వల్లో 20 శాతం ఈ జలసంధి నుంచి రవాణా అవుతుంది. ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచే అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరిగిపోతున్నాయి. ఇప్పుడు ఈ జలసంధిని కూడా మూసేస్తే ఇంధన ధరలు ఆకాశాన్నంటుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌పై భారం..?

భారత్‌కు అవసరమైన చమురు దిగుమతుల్లో 4550 శాతం, సహజ వాయువు దిగుమతుల్లో 60 శాతం హోర్ముజ్ మార్గం నుంచే వస్తుంది. ఇప్పటికే ఇజ్రాయెల్ఇరాన్ వివాదం కారణంగా గ్లోబల్ మార్కెట్లో చమురు ధరలు బ్యారెల్‌కు 6465 డాలర్ల నుంచి 74 75 డాలర్లకు పెరిగింది. ఇలా ముడి చమురు ధరలు పెరగడం ఆయిల్ కంపెనీలపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. ఇలాంటి సమయంలో హోర్ముజ్ జలసంధిని మూసేస్తే అంతర్జాతీయ సరఫరాకు మరింత అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావం భారత చమురు దిగుమతులపై పడే అవాశం ఉంది. భారత్ 1314 బిలియన్ డాలర్లు (రూ. లక్షల కోట్ల) విలువైన చమురును దిగుమతి చేసుకుంటుంది. హోర్ముజ్ జలసంధిని మూసేస్తే ఆ భారం ఈ దిగుమతులపై పడుతుందని మార్కెటింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.




# న్యూ సిటీ స్పోర్ట్ కారును లాంచ్ చేసిన హోండా

**'హోండా కార్స్ ఇండియా' తన మిడ్-సైజ్ సెడాన్ వేరియంట్ 'న్యూ సిటీ స్పోర్ట్'ను ప్రారంభించింది.**

భారత్‌లో ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామిగా ఉన్న హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (HCIL), ఈరోజు తన మిడ్ సైజ్ సెడాన్‌కు సంబంధించిన వేరియంట్ 'న్యూ సిటీ స్పోర్ట్'ను ప్రారంభించింది. యువ కొనుగోలుదారులను ఆకర్షించడానికి రూపొందించిన సిటీ స్పోర్ట్..నలుపు రంగు యాక్సెంట్‌లతో స్పోర్టి ఎక్స్‌టీరియర్ స్టైలింగ్, కాంట్రాస్టింగ్ రెడ్ హైలైట్‌లతో, ప్రత్యేకమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది. 'లైఫ్ ఈజ్ ఎ స్పోర్ట్' అనే ట్యాగ్‌లైన్‌తో సిటీ స్పోర్ట్ పరిమిత యూనిట్లలో సిటీ లైనప్‌లో కొత్త గ్రేడ్‌గా అందుబాటులో ఉంటుంది. ఈ కారు ప్రత్యేకతను కోరుకునే వారి కోసం రూపొందించారు. ఇది CVT(ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్)లో రేడియంట్ రెడ్ మెటాలిక్, ప్లాటినం వైట్ పెర్ల్, మీటియోరాయిడ్ గ్రే మెటాలిక్ అనే 3 రంగుల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది.

1.5 iVTEC పెట్రోల్ ఇంజిన్‌ను కలిగి ఉన్న హోండా సిటీ స్పోర్ట్ CVT ధర రూ.14,88,900, ఎక్స్‌షోరూం, ఢిల్లీ. పెర్ల్ కలర్ కారుపై అదనపు ధర వర్తిస్తుంది. భారత్‌లోని ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామిగా ఉన్న హోండా కార్స్ ఇండియా లిమిటెడ్..1995, డిసెంబర్లో హోండాకు సంబంధించిన ప్యాసింజర్ కార్ మోడల్స్, టెక్నాలజీలను భారతీయ వినియోగదారులకు అందించాలనే నిబద్ధతతో స్థాపించారు. కు సంబంధించిన కార్పొరేట్ కార్యాలయంలోని గ్రేటర్ నోయిడాలో ఉంది. దాని అత్యాధునిక తయారీ సౌకర్యం రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలోని తపుకరలో ఉంది.








# యాపిల్.. ఫేస్‌బుక్.. గూగుల్.. 16 బిలియన్ల పాస్‌వర్డ్‌లు లీక్!

**యాపిల్, ఫేస్‌బుక్, గూగుల్, గిట్‌హబ్, టెలిగ్రామ్, ఇతర ప్రభుత్వ వెబ్‌సైట్ల యూజర్ల లాగిన్ వివరాలను సైబర్ నేరగాళ్లు పెద్ద మొత్తంలో లీక్ చేసినట్లు సైబర్ భద్రతా పరిశోధకులు వెల్లడించారు.**

డిజిటల్ యుగంలో సాంకేతికత వల్ల లాభాలే కాకుండా నష్టాలు కూడా తీవ్రమవుతున్నాయి. సాంకేతికతను ఉపయోగించుకొని సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పంథాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ మోసాలు ప్రపంచవ్యాప్తంగా ఒక తీవ్రమైన సమస్యగా మారాయి. పలు ప్రముఖ సంస్థల డేటాలను కూడా సైబర్ నేరగాళ్లు సులభంగా లీక్ చేయగలుగుతున్నారు. తాజాగా యాపిల్ .. ఫేస్‌బుక్.. గూగుల్ .. వంటి ప్రముఖ సంస్థలకు చెందిన 16 బిలియన్ల పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ భద్రతా పరిశోధకులు పేర్కొన్నాయి. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద డేటా లీక్ ఉల్లంఘనల్లో ఒకటిగా తెలిపాయి. మే 23న విడుదలైన ఫోర్బ్స్‌లోని ఒక నివేదిక ప్రకారం.. యాపిల్, ఫేస్‌బుక్, గూగుల్, గిట్‌హబ్, టెలిగ్రామ్, ఇతర ప్రభుత్వ వెబ్‌సైట్ల యూజర్ల లాగిన్ వివరాలు లీక్ అయినట్లు తెలిపింది. వివిధ రకాల సామాజిక మాధ్యమాల ఖాతాలు, టెక్ సంస్థల యూజర్ల పాస్‌వర్డ్‌లు సైతం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు.

గతంలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలకు చెందిన 184 మిలియన్ల యూజర్ల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ సెక్యూరిటీ నిపుణులు పేర్కొనగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 16 బిలియన్‌లకు చేరిందని అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. నివేదికల ప్రకారం.. సైబర్ భద్రతా పరిశోధకులు మొత్తం 30 డేటా సెట్‌లను కనుగొన్నారు. ఒక్కో డేటా సెట్‌లో 3.5 బిలియన్ రికార్డులు ఉన్నట్లు గుర్తించారు. సోషల్ మీడియా వీపీఎన్ లాగిన్‌లతో పాటు వివిధ కార్పొరేట్ డెవలపర్ ప్లాట్‌ఫారమ్‌లను కలిగిఉన్న సంస్థలకు చెందిన ఖాతాలలో 2025 ప్రారంభం నుంచి లాగిన్ అయిన అన్ని ఖాతాల వివరాలు వీటిలో రికార్డ్ అవుతున్నట్లు తెలిపారు.

ఇటువంటి డేటా ఉల్లంఘనలను తప్పించుకోవడానికి గూగుల్ తన వినియోగదారులకు పాత సైన్‌ఇన్ పద్ధతులను మార్చి, మెయిళ్ల ద్వారా ఖాతాల భద్రతను అప్‌గ్రేడ్ చేయాలని సలహాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగానే గూగుల్ తన వినియోగదారులు వారి ఖాతాలపై మెరుగైన నియంత్రణ ఏర్పరుచుకోవడం కోసం ఖాతాలను పాస్‌కీలకు, సోషల్ సైన్‌ఇన్‌లకు అప్‌గ్రేడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

పాస్‌కీలు అనేది స్మార్ట్‌ఫోన్ వంటి వాటి ద్వారా బయోమెట్రిక్ ప్రామాణీకరణతో పాస్‌వర్డ్‌లను భర్తీ చేసే లాగిన్ సిస్టమ్. గూగుల్ పాస్‌కీలను 'ఫిషింగ్ రెసిస్టెంట్'గా చూస్తోంది. ఇది వినియోగదారులు వారి పరికరాలను అన్‌లాక్ చేయడానికి వేలిముద్ర, ముఖ స్కాన్ వంటివి ఉపయోగించుకొని లాగిన్ అవ్వడానికి సహాయపడుతుంది.

# ఆధార్ ఉంటేనే తత్కాల్ టికెట్.. అథంటికేషన్ ఎలా?

**తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించిన కొత్త రూల్స్ జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కాబట్టి యూజర్లు తమ అకౌంట్‌ను ఆధార్‌తో అథంటికేషన్ చేయాల్సిందే.**

తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించి జులై 1 నుంచి కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో ఆధార్ అథంటికేషన్, కేవైసీ పూర్తి చేసిన వ్యక్తులు మాత్రమే టికెట్ బుక్ చేసుకునే వీలుంది. అంతేకాదు జులై 15 నుంచి టికెట్ బుకింగ్ సమయంలో ఆధార్ ఓటీపీ కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. తత్కాల్ టికెట్ బుకింగ్‌లో అక్రమాలకు అడ్డుకట్టవేసి నిజమైన ప్రయాణికులకు టికెట్లు దక్కేలా చూడడమే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకొస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇంతకీ ఆధార్ అథంటికేషన్ ప్రక్రియను ఎలా పూర్తి చేయాలో ఇప్పుడు చూద్దాం..

**ఆధార్ అథంటికేషన్ ఇలా..** ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్‌లోకి లాగిన్ అవ్వండి.

అందులో 'మై అకౌంట్ సెక్షన్'లోకి వెళ్లి 'అథంటికేట్ యూజర్' ఆప్షన్‌పై క్లిక్ చేయండి.

అక్కడ ఆధార్ నంబర్ లేదా వర్చువల్ ఐడీ నంబర్ ఎంటర్ చేసి వెరిఫై డీటెయిల్స్‌పై క్లిక్ చేయండి.

మీ ఆధార్‌కు అనుసంధానం అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయండి. దిగువన ఉన్న టర్మ్స్ అండ్ కండీషన్స్ చెక్ బాక్స్ క్లిక్ చేసి సబ్మిట్ చేయడంతో ఆధార్ అథంటికేషన్ పూర్తి అవుతుంది.

ఒకవేళ ఇది వరకే ఆధార్ అథంటికేషన్ పూర్తి చేసి ఉంటే మై అకౌంట్‌లోకి వెళ్లి అథంటికేషన్ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. మై ప్రొఫైల్ విభాగంలోకి వెళ్లి మీ వ్యక్తిగత ప్రొఫైల్‌ను కూడా పూర్తి చేయండి. మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ వివరాలు అసంపూర్తిగా ఉంటే వాటిని పూర్తి చేయండి.






# వరుస నష్టాలకు బ్రేక్: భారీ లాభాల్లో సూచీలు.. 25వేల పైకి నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1046 పాయిట్లు, నిఫ్టీ 319 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి.

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నా మన సూచీలు రాణించడం గమనార్హం. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ప్రధానంగా బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25,100 మార్కును దాటింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.446.37 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 81,354.85 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,361.87) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా భారీ లాభాల్లో కొనసాగింది. ఇంట్రాడేలో 82,494.49 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1046.30 పాయింట్ల లాభంతో 82,408.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 319 పాయింట్లు లాభపడి 25,112.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.59గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్లు కాగా.. బంగారం ఔన్సు 3372 డాలర్లు వద్ద కొనసాగుతోంది.

**సూచీల పరుగుకు కారణమిదీ..**

ఇటీవల సూచీలు వరుస నష్టాల నేపథ్యంలో ఆకర్షణీయంగా మారాయి. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగినట్లు అనలిస్టులు భావిస్తున్నారు.

గడిచిన మూడు సెషన్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది.

# విమాన ప్రమాదం: ఎయిరిండియా బుకింగ్స్‌పై ఎఫెక్ట్.. ఫేర్స్ డౌన్

**అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన తర్వాత ఎయిరిండియా బుకింగ్స్‌పై ప్రభావం పడింది. టికెట్ ధరలూ తగ్గుముఖం పట్టాయి.**




**ఢిల్లీ:** అహ్మదాబాద్ ఘోర విమాద ప్రమాద ఘటన ప్రభావం ఎయిరిండియా బుకింగ్స్‌పై పడింది. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో 20 శాతం మేర బుకింగ్స్ క్షీణించాయి. టికెట్ ధరలు సైతం 815 శాతం మేర తగ్గుముఖం పట్టాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రవి గోసైన్ పేర్కొన్నారు. దీనిపై ఎయిరిండియా అధికారికంగా స్పందించలేదు. 242 మంది ప్రయాణికులతో లండన్ వెళుతున్న ఎయిరిండియా ఏఐ171 విమానం అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన కాసేపటికే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఒక్కరు మినహా ప్రయాణికులంతా దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన అనంతరం ముఖ్యంగా అంతర్జాతీయ రూట్లలో ఎయిరిండియా బుకింగ్స్ తగ్గుముఖం పట్టడాన్ని గమనించామని గోసైన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ రూట్లలో 1822 శాతం మేర బుకింగ్స్ తగ్గుముఖం పట్టగా.. దేశీయ రూట్లలో 1012 శాతం మేర ఎయిరిండియా బుకింగ్స్ క్షీణించినట్లు అంచనా వేశారు.

ఎయిరిండియా విమాన టికెట్ ధరలు సైతం దేశీయ మార్గాల్లో 812 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్గాల్లో, ముఖ్యంగా యూరప్, ఆగ్నేసియా మార్గాల్లో 1015 శాతం టికెట్ ధరలు తగ్గుముఖం పట్టాయని గోసైన్ పేర్కొన్నారు. డిమాండ్ లేమితో పాటు, ప్రమోషనల్ స్ట్రాటజీ కూడా టికెట్ ధరలు తగ్గడానికి కారణమని విశ్లేషించారు.

టూర్ ఆపరేటర్ల ద్వారా ఎయిరిండియా విమానాలకు టికెట్లు బుక్ చేసుకున్న వాళ్లు కూడా వాటిని రద్దు చేసుకుంటున్నారని గోసైన్ పేర్కొన్నారు. కార్పొరేట్, ఉన్నత స్థాయి ప్రయాణికులు ప్రత్యామ్నాయ విమానాలను ఎంచుకున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్గాల్లో టికెట్ల రద్దు 1518 శాతంగా ఉండగా.. దేశీయ మార్గాల్లో ఇది 810 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి స్వల్పకాలం మాత్రమేనని, రానున్న రోజుల్లో ఇది తగ్గుముఖం పడుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఇన్ ఇండియన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహ్రా సైతం ఎయిరిండియా టికెట్ బుకింగ్‌లు 20 శాతం మేర తగ్గుముఖం పట్టడం గమనించామని పేర్కొన్నారు. ఆ విమానయాన సంస్థకు చెందిన టికెట్ ధరలు కూడా 10 శాతం మేర క్షీణించాయని పేర్కొన్నారు.

# టూవీలర్లన్నింటికీ ఇక ABS.. వచ్చే ఏడాది నుంచి తప్పనిసరి!

**ద్విచక్ర వాహనాలన్నింటికీ ఏబీఎస్‌ను తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తోంది.**

ద్విచక్ర వాహన ప్రమాదాలు తగ్గించేందుకు కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకొనే దిశగా అడుగులు వేస్తోంది. దేశంలో అమ్ముడయ్యే టూవీలర్లన్నింటికీ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్‌ను తప్పనిసరి చేయనుంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాలని కేంద్రం భావిస్తోంది. ఈమేరకు త్వరలోనే కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ప్రస్తుతం దేశీయంగా అమ్ముడవుతున్న 150 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన టూవీలర్లకే ఏబీఎస్ తప్పనిసరి అన్న నిబంధన అమలవుతోంది. ఇకపై ఎంట్రీ లెవల్ మోడళ్లు సహా అన్ని టూవీలర్లకూ దీన్ని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో మొత్తం ఎంట్రీ లెవల్ మోడళ్లే దాదాపు 75 శాతం వరకు ఉన్నాయి. 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం వరకు టూవీలర్ల కారణంగా జరుగుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

**వాహనదారులకు గుడ్‌న్యూస్.. ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రకటించిన కేంద్రం పెరగనున్న ధరలు**

ఏబీఎస్ నిబంధనను తప్పనిసరి చేస్తే ఆ మేర టూవీలర్ ధరలు పెరగనున్నాయి. ఏబీఎస్‌ను అమర్చడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఆ భారాన్ని కంపెనీలు వినియోగదారులకే బదిలీ చేస్తాయి. దీనివల్ల ఎంట్రీ లెవల్ టూవీలర్ మోడళ్ల ధరలు రూ.2500 నుంచి రూ.5వేల వరకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ప్రమాదాలను అడ్డుకోవడంలో ఏబీఎస్ ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు.

**ఏబీఎస్ అంటే?**

ఏబీఎస్ అంటే యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్. ఇది వాహనాల్లో ఉపయోగించే ఒక భద్రతా వ్యవస్థ.



సడన్ బ్రేకింగ్ సమయంలో చక్రాలు లాక్ అవ్వకుండా నిరోధిస్తుంది. దీనివల్ల డ్రైవర్‌కు వాహనం మీద నియంత్రణ ఉంటుంది. వాహనం స్కిడ్ కాకుండా నివారిస్తుంది.

# ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా

## అక్కినేని నాగార్జున



**"కుబేర' సినిమాలో నాది బిలియనీర్ పాత్ర అని అందరూ అనుకుంటున్నారు. కానీ, నాది మధ్య తరగతి వ్యక్తి ప్రాత. సీబీఐ ఆఫీసర్‌గా కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య నా పాత్ర ఉంటుంది. నా క్యారెక్టర్‌ని శేఖర్ కమ్ముల చాలా అద్భుతంగా రాశారు. నా పాత్రలో చాలా ఛాయలుంటాయి.. అదే విధంగా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్‌కి మంచి చాన్స్ దక్కింది" అని అక్కినేని నాగార్జున తెలి పారు.**

అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున పంచుకున్న విశేషాలు.

- 'కుబేర' లాంటి మంచి కథలు రావాలంటే స్టార్ హీరోలు కలిసి పని చేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు కలిసి చేశాను. గతంలో నాన్న గారు (ఏఎన్ఆర్), ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు గార్లు... ఇలా చాలా మంది కలిసి మల్టీస్టారర్ సినిమాలు ఎన్నో చేశారు. పైగా శేఖర్ కమ్ములగారితో పని చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. 'ఆనంద్' సినిమా నుంచి ఆయన ఏంటో, ఆయన సినిమాలు ఎలా ఉంటాయో మనందరికీ తెలుసు. ఆయన కథల్లో సామాజిక సంబంధిత అంశాలు ఉంటాయి. అందుకే శేఖర్‌గారి సినిమాలు నాకు బాగా ఇష్టం. తన సినిమాల్లో సామాజిక అంశాలతో పాటు ఇతర వాణిజ్య అంశాలు కూడా ఉంటాయి.
- 'కుబేర'లో మంచి యునిక్ పాయింట్ ఉంది. ప్రస్తుత సమాజానికి ఆ పాయింట్ చాలా దగ్గరగా ఉంటుంది. అలాగే అద్భుతమైన సంఘటనలు ఉంటాయి. అవన్నీ కూడా నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాలో మంచోళ్లు ఉన్నారు, చెడ్డోళ్లు ఉన్నారు. బిలియనీర్, మధ్యతరగతి, బిలో పావర్టీ లైన్... ఇలా మూడు సొసైటీల మధ్య క్లాష్ ఈ సినిమాలో ఉంటుంది. వైవిధ్యమైన ఈ కథలో రెగ్యులర్ స్క్రీన్ ప్లే ఉండదు... రొటీన్ క్యారెక్టర్స్ కనిపించవు. ఇందులో ఏ పాత్ర కూడా హీరో, హీరోయిన్ అనడానికి లేదు. తెరపై మేము కాకుండా ప్రేక్షకులకు అన్నీ పాత్రలే కనిపిస్తాయి. ఇలాంటి సినిమాలు చేయడానికి ధైర్యం కావాలి.
- ఈ సినిమాలో నా ఇమేజ్‌కి తగ్గట్టు స్క్రిప్ట్‌లో శేఖర్‌గారు ఎలాంటి మార్పులు చేయలేదు. ఆయన ఏమనుకున్నారో అదే చేశారు. నేను కూడా ఎలాంటి మార్పులు అడగలేదు.. మార్చితే కథ మారిపోతుంది. మా ఫ్యామిలీలో దాదాపుగా అందరూ శేఖర్‌గారితో పని చేశారు. 'కుబేర'లో చేయడానికి ఆయన వర్కింగ్ స్టైల్ గురించి నాగ చైతన్యని అడిగాను. ఎందుకంటే రీసెంట్‌గా తను 'లవ్ స్టోరీ' మూవీ చేశాడు కాబట్టి. 'శేఖర్‌గారి వర్కింగ్ స్టైల్ చాలా బాగుంటుంది. మీరు చాలా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పాడు. 'కుబేర'లో నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్... అన్నీ కూడా కొత్తగా శేఖర్‌గారి శైలిలో ఉంటాయి. తమిళ్ వెర్షన్‌లోనూ నేనే డబ్బింగ్ చెప్పాను.
- ధనుష్ తన పాత్రలో ఒదిగిపోయాడు.. అద్భుతంగా నటించాడు. సెట్స్‌లో మా బాండింగ్ చాలా బాగుండేది. షాట్ గ్యాప్‌లో సినిమాల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఈ చిత్రంలో రష్మికా మందన్న అద్భుతంగా నటించింది. ఫైనల్ కాపీ చూశాక, ఫోన్ చేసి 'కుబేర'లో నువ్వే స్టార్' అని చెప్పాను.. తను చాలా సంతోషపడింది. సునీల్ నారంగ్, రామ్మోహన్‌గార్లు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా చాలా ప్యాషన్‌తో నిర్మించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి చాలా ముఖ్యం. పాటలు కూడా సందర్భానుసారంగా వస్తాయి. కెమెరామేన్ నికేత్ బొమ్మరెడ్డి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు.
- ప్రస్తుతం చాలా మంది పాన్ ఇండియా సినిమా అంటూ నాలుగైదు భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్స్ వేసుకుంటున్నారు. నిజం చెప్పాలంటే పాన్ ఇండియా సినిమాలు చేయడం చాలా కష్టమైన పని. అన్ని సినిమాలూ దానికి సరిపోవు. స్టార్ హీరోలు, స్టార్ డైరెక్టర్, బిగ్ ప్రొడక్షన్ హౌస్ కలిసి పెద్ద సినిమా చేసినప్పటికీ కథలో విషయం లేకుంటే ఉపయోగం లేదు. ఈ మధ్య అలాంటి భారీ బడ్జెట్ సినిమాల్ని కూడా ప్రేక్షకులు తిరస్కరించారు. కానీ 'కోర్ట్' లాంటి చిన్న సినిమా సూపర్ హిట్ అయింది. నా దృష్టిలో ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా. అలాగే మంచి కథ ఉన్నదే పెద్ద సినిమా.
- **నా కెరీర్‌లో వందో సినిమాని తమిళ దర్శకుడు కార్తీక్‌తో చేస్తున్నాను. 'కింగ్ 100' అని వర్కింగ్ టైటిల్ పెట్టాం. ఈ చిత్రాన్ని మా అన్నపూర్ణ స్టూడియోస్‌పై నిర్మిస్తాం. అయితే వందో సినిమా వంద కోట్ల బడ్జెట్‌తో రూ పొందనుందనే వార్తల్లో నిజం లేదు. అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' చిత్రంలో నేను నటించడం లేదు. నేను, నాగచైతన్య, అఖిల్ కలిసి పూర్తి స్థాయిలో ఓ సినిమా చేయాలని మా అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ఇప్పుడప్పుడే అలాంటి సినిమా వచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే మా ముగ్గురికి సరిపడే కథతో ఇప్పటివరకూ ఎవరూ నన్ను కలవలేదు.**
- నటుడిగా దాదాపు నలభై ఏళ్ల కెరీర్ నాది. ఎన్నో పాత్రలు చేశాను. అయితే ఫలానా పాత్ర చేయాలనే కల నాకు లేదు. నాకు నచ్చిన, వైవిధ్యమైన పాత్రలు చేసుకుంటూ వెళుతుంటాను. రజనీకాంత్‌గారి 'కూలీ' సినిమాలో ప్రాపర్ విలన్‌గా కనిపిస్తాను. లోకేశ్ కనగరాజ్ చక్కగా తీశారు. అయితే 'కూలీ'లోలా మళ్లీ విలన్ పాత్ర చేయను. క్యారెక్టర్ నచ్చితే కామెడీ కూడా చేస్తాను. ఏం చేసినా నాకు కొత్తగా అనిపించాలి. నేను నటించిన 'శివ' సినిమాని రీ రిలీజ్ చేయబోతున్నాం. 4కే పనులు పూర్తయ్యాయి. ఇంకా బెటర్ ఎఫెక్ట్స్ కోసం వర్క్ జరుగుతోంది. ఒక రీల్ చూశాను.. క్వాలిటీ అద్భుతంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లలో సినిమాకి చర్చలు జరిగాయి. అదే విధంగా 'బ్రహ్మాస్త్ర 2' లోనూ నా పాత్ర ఉంటుందని డైరెక్టర్ అయాన్ ముఖర్జీ చెప్పారు.

# 'కుబేర'పై సాయిపల్లవి అభిప్రాయమిదే.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన నటి

ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. ఈ సినిమాపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు నటి సాయిపల్లవి

హైదరాబాద్: ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' . శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే దీనిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు నటి సాయిపల్లవి . ఈ ప్రాజెక్ట్‌లో ఎన్నో విశేషాలు ఉన్నట్లు ఆమె చెప్పారు. టీమ్ అందరికీ ఇది సంతోషాన్ని ఇవ్వాలని ఆమె కోరుకున్నారు. తన గురువు (శేఖర్ కమ్ముల) మరో అద్భుతమైన విజయాన్ని అందుకోవాలని సాయిపల్లవి ఆకాంక్షించారు.

''కుబేర' ఎంతో ప్రత్యేకమైన చిత్రం. దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. సవాలుతో కూడుకున్న పాత్రలను ఎంచుకోవడంలో ఎప్పుడూ ముందుండే ధనుష్ మరోసారి తన నటనతో ప్రేక్షకులను అలరించనున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు నాగార్జునను ఇలాంటి అద్భుతమైన పాత్రలో చూడటం అభిమానులకు కనువిందు కానుంది. శేఖర్ తెరకెక్కించే చిత్రాల్లో కథానాయికల పాత్రలు పవర్‌ఫుల్‌గా ఉంటాయనే విషయం సినీ ప్రియులందరికీ తెలుసు. అదేవిధంగా ఇందులో రష్మిక పోషించిన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్స్‌తో కొనసాగుతోన్న ఆమెకు ఈ సినిమా మరో విజయాన్ని అందించనుంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్.. మీ కెరీర్‌లోని బెస్ట్ ఆల్బమ్స్‌లో ఇదీ ఒకటి కానుంది. ఈ సినిమా కోసం చెమటోడ్చిన ప్రతిఒక్కరికీ ప్రశంసలు దక్కాలని కోరుకుంటున్నా. నిర్మాత సునీల్ గారు రూపొందిస్తోన్న చిత్రాలు చూసి ఆయన తండ్రి నారాయణ్‌దాస్ గారు ఎంతో సంతోషిస్తుంటారు. స్వచ్ఛమైన హృదయం, అద్భుతమైన టాలెంట్ కలిగిన వ్యక్తి, నాకెంతో ఇష్టమైన దర్శకుడు శేఖర్ కమ్ముల గారు. తన కథలతో ఆయన ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. అలా, ప్రేరణ పొందిన వారిలో నేనూ ఒకదాన్ని. నా గురువు ఎప్పుడూ సంతోషం, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఇలాంటి అద్భుతమైన కథలెన్నో మనకు అందించాలని నేను కోరుకుంటున్నా. నేడు ఈ టీమ్ అందరి ఆనందం కోసం నేను ప్రార్థిస్తున్నా'' అని ఆమె రాసుకొచ్చారు.

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన చిత్రమిది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# 'ప్రతీ సెకను శ్రమిస్తున్నా'..: 'వార్ 2'పై దర్శకుడు కీలక వ్యాఖ్యలు

ఎన్టీఆర్ , హృతిక్ రోషన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'వార్ 2' . ఈ చిత్రాన్ని ఉద్దేశించి చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు.

ముంబయి: బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ , ఎన్టీఆర్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'వార్ 2' . యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలోనే చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో తనపై ఎంతో బరువు బాధ్యతలు ఉన్నాయని చెప్పారు. ప్రేక్షకుల అంచనాలను దృష్టిలో ఉంచుకుని తాను వర్క్ చేస్తున్నానని అన్నారు.



''వార్' చిత్రానికి ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం కావడంతో 'వార్ 2' విషయంలో నాపై ఎంతో బాధ్యత ఉంది. ఇది నాకు దొరికిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా. ఇలాంటి భారీ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందిస్తున్నా. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేస్తుండటంతో స్టోరీ లైన్ విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా. యాక్షన్ పార్ట్స్, హృతిక్ రోషన్‌ఎన్టీఆర్‌ల మధ్య ఘర్షణకు అవసరమైన వివాదాన్ని చూపించడం వంటి విషయాల కోసం ఎక్కువ సమయం తీసుకున్నా. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి చేసిన సినిమా కావడంతో ఇది నిజమైన ఇండియన్ సినిమా కానుంది. ఈ సినిమాపై అభిమానులు ఏవిధమైన అంచనాలు పెట్టుకున్నారో నాకు తెలుసు. థియేటర్లలో కూర్చున్నప్పుడు వారికి జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని ఇచ్చేందుకు ప్రతి సెకన్ పనిచేస్తున్నా'' అని అయాన్ ముఖర్జీ తెలిపారు.

యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న స్పై యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఆరో చిత్రమిది. 2019లో విడుదలైన 'వార్'కు కొనసాగింపుగా ఇది రూపొందుతోంది. కియారా అడ్వాణీ కథానాయిక. ఆగస్టు 14న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని చిత్రబృందం ఇటీవల 'వార్ 2' టీజర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఢీ అంటే ఢీ అన్నట్టుగా తలపడే సన్నివేశాలు, యాక్షన్ హంగామా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# బాలకృష్ణ మూవీ.. ఆ మాట వినగానే ఏడ్చారా?: స్పందించిన లయ



**'తమ్ముడు' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు నటి లయ. బాలకృష్ణ మూవీ ప్రస్తావనకు రాగా.. ఆమె స్పందించారు.**

**కొన్నాళ్ల విరామం అనంతరం 'తమ్ముడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు లయ. నితిన్ హీరోగా తెరకెక్కిన ఈ మూవీ జులై 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ క్రమంలో.. బాలకృష్ణ మూవీ ప్రస్తావనకు వచ్చింది.'చెన్నకేశవరెడ్డి'లో సిస్టర్ రోల్ కోసం దర్శకుడు వి.వి. వినాయక్ అడగ్గానే.. తెలుగు హీరోయిన్ అయితే చెల్లెలి పాత్రకు అడుగుతారా అంటూ ఏడ్చారట.. అది నిజమేనా?' అని ప్రశ్నించగా.. అప్పుడు ఏం జరిగిందో తనకు అంతగా గుర్తులేదన్నారు. ఫీల్ అయి ఉండి ఉంటానేమో.. కానీ, ఏడవలేదు అని సమాధానమిచ్చారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు మారాయని, హీరోయిన్ ఎలాంటి రోల్ ప్లే చేసినా ప్రేక్షకులు అంగీకరిస్తున్నారని అభిప్రాయ పడ్డారు.**

**ఇక 'స్టార్ 2000' పోటీలో తాను రన్నరప్‌గా నిలిచిన తర్వాత.. 'నువ్వు హీరోయిన్ అవడానికి ఇంకాస్త సమయం ఉంది. ప్రస్తుతం సిస్టర్ రోల్స్ చేయకు' అని దర్శకుడు రాఘవేంద్రరావు ఇచ్చిన సలహాను ఆమె గుర్తుచేసుకున్నారు.**

**బాలకృష్ణతో కలిసి నటించే అవకాశం 'చెన్నకేశవరెడ్డి' తో మిస్ అయినా ఆ తర్వాత 'విజయేంద్రవర్మ' తో ఛాన్స్ దక్కించుకున్నారు. వివాహం అనంతరం లయ నటనకు దూరమైన సంగతి తెలిసిందే. 2018లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంటొని'లో అతిథి పాత్ర పోషించారు. 'తమ్ముడు'లో కీలక పాత్రలో కనిపించనున్నారు. అక్కా తమ్ముడు అనుబంధం నేపథ్యంతో దర్శకుడు శ్రీరామ్ వేణు ఈ సినిమాని తెరకెక్కించారు.**



# ఇండస్ట్రీలో ఇదే జరుగుతోంది.. ఆ బ్రేకప్ వల్ల మూడేళ్లపాటు బాధలోనే..

ప్రేమలో మోసపోయానంటోంది తెలుగు హీరోయిన్ అనన్య నాగళ్ల . తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీలో ఉన్నప్పుడు నాకు బ్రేకప్ జరిగింది. ఆ సమయంలో నా మనసుకు, మెదడుకు, చేతలకు సంబంధమే లేకుండా పోయింది. అతడికి ఫోన్ చేయడం ఇష్టం లేకపోయినా నాకు తెలీకుండానే ఫోన్ చేసేవాడిని. ఎందుకు చేశానో అర్థమయ్యేది కాదు. రెండు, మూడేళ్లపాటు చాలా బాధపడ్డాను.

**కేరవాన్‌లో ఏడ్చేసి..**

కానీ, చేసే పనిపై దాని ప్రభావాన్ని పడనివ్వలేదు. రాత్రంతా ఏడ్చి ఉదయాన్ని జిమ్‌కు వెళ్లిపోయేదాన్ని. కేరవాన్‌లో ఏడ్చేసి.. ఏం జరగనట్లు కళ్లు తుడుచుకుని నవ్వుకుంటూ బయటకు వచ్చేదాన్ని. ఈ బాధలో నుంచి బయటకు వస్తానా? లేదా? అనుకున్నాను. తర్వాత ఇదంతా ఒక మాయ అని తెలుసుకుని బయటపడ్డాను అని తెలిపింది.

**తెలుగమ్మాయికి అవకాశాలు తక్కువ?**

తెలుగమ్మాయిలకు వస్తున్న అవకాశాల గురించి అనన్య మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీ అంటేనే ఒక బిజినెస్. హిట్స్ వస్తేనే మార్కెట్ పెరుగుతుంది, అప్పడే హీరోయిన్లను సినిమాలో పెట్టుకుంటారు. వైష్ణవి చైతన్య విషయంలో అదే జరిగింది. మంచి ప్రాజెక్ట్స్ ఇచ్చారు. కానీ, వేరే ఇండస్ట్రీ నుంచి వచ్చిన అమ్మాయి బ్లాక్‌బస్టర్ హిట్ కొడితే వచ్చినన్ని అవకాశాలు.. తెలుగమ్మాయి బ్లాక్‌బస్టర్ హిట్ కొడితే రావట్లేదు. ఇదే నిజం. హిట్స్ ఉన్నా ఎందుకు మంచి అవకాశాలు రావడం లేదని కొంతకాలం బాధపడ్డాను. తర్వాత నాకోసం నేను మార్కెటింగ్ చేసుకోవడం మొదలుపెట్టాను.

**నాకు నేనే మార్కెటింగ్**

సినిమాల్లో యాక్ట్ చేసి వదిలేయకుండా వాటి ప్రమోషన్స్‌పై ఎక్కువగా ఫోకస్ చేశాను. దానివల్ల నాకంటూ ఫీమేల్ ఓరియంటెడ్ స్క్రిప్టులు వస్తున్నాయి. బాలీవుడ్‌లో ఉమెన్ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నాను. తెలుగులోనూ రెండు చిత్రాలు చేస్తున్నాను అని చెప్పుకొచ్చింది. మల్లేశం సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన అనన్య.. వకీల్ సాబ్, తంత్ర, శాకుంతలం వంటి చిత్రాల్లో నటించింది. పొట్టేల్ సినిమాకుగానూ గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకుంది.



# అగ్ర స్థానమే లక్ష్యంగా...

## నేడు పారిస్ డైమండ్ లీగ్ బరిలో నీరజ్ చోప్రా

**పారిస్:** భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో అగ్ర స్థానం లక్ష్యంగా మరో టోర్నీలో బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది 90 మీటర్ల మార్క్‌ను అందుకున్న ఈ మాజీ ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ పారిస్ డైమండ్ లీగ్‌లో టాప్ ర్యాంక్‌పై కన్నేశాడు. జర్మన్ స్టార్ జులియన్ వెబెర్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గెనడా) తదితర హేమాహేమీలంతా ఈ మీట్‌లో ఉండటంతో జావెలిన్ త్రో పోటీ ఆద్యంతం రసవత్తరంగా జరగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పైగా 8 మంది బరిలోకి దిగుతున్న ఫైనల్ ఈవెంట్‌లో ఐదుగురు జావెలిన్ త్రోయర్లు 90 మీటర్ల మార్క్‌ను అధిగమించిన వారే ఉండటం పోటీని దీటుగా మార్చేసింది. భారత కాలమానం ప్రకారం నీరజ్ ఈవెంట్ రాత్రి 1 గంట 12 నిమిషాలకు మొదలవుతంది.

గత నెలలో జరిగిన దోహా డైమండ్ లీగ్ మీట్‌లో వెబెర్... నీరజ్ చోప్రాను అధిగమించాడు. వెబెర్ ఈటెను 91.06 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో ... చోప్రా 90.23 మీటర్లతో రెండో స్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన పోలాండ్ మీట్‌లో ఇద్దరు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చలేకపోయినా... మళ్లీ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.





# జైస్వాల్, శుభ్‌మన్ సెంచరీలు..

# మొదటి రోజు భారత్‌దే ఆధిపత్యం

**ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో మొదటి రోజు ఆట ముగిసింది.**

**హెడింగ్లీ (లీడ్స్):** ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్ మొదటి రోజు ఆటలో భారత్ దే ఆధిపత్యం. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే శుభ్‌మన్ గిల్ (127*; 175 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించడం విశేషం. అతడితోపాటు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (101; 159 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో అలరించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 3 వికెట్ల నష్టానికి 359 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. రిషభ్ పంత్ (65*; 102 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకం బాదాడు. కేఎల్ రాహుల్ (42) రాణించగా.. అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్ డకౌట్ అయి నిరాశపర్చాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 2, బ్రైడన్ కార్స్ ఒక వికెట్ పడగొట్టారు.

**అదిరే ఆరంభం..**

జైస్వాల్, రాహుల్ భారత్‌కు శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం (151 బంతుల్లో) నెలకొల్పింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన రాహుల్ తర్వాత నిలకడగా బౌండరీలు బాదాడు. స్టోక్స్ వేసిన 20వ ఓవర్‌లో చక్కటి కవర్ డ్రైవ్‌లతో వరుసగా రెండు ఫోర్లు రాబట్టాడు. అంతా బాగుందనుకున్న వేళ.. లంచ్ బ్రేక్‌కు ముందు భారత్ స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లను కోల్పోయింది. అర్ధ శతకం దిశగా సాగుతున్న రాహుల్.. బ్రైడన్ కార్స్ వేసిన 24.5 ఓవర్‌కు ఫస్ట్ స్లిప్‌లో జో రూట్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్ కలిసిరాలేదు. నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. బెన్ స్టోక్స్ వేసిన 25.4 ఓవర్‌కు వికెట్ కీపర్ జేమీ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు.

రెండో సెషన్‌లో భారత బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగింది. 92/2తో సెషన్‌ను ఆరంభించిన టీమ్ఇండియా.. గిల్, జైస్వాల్ దూకుడుగా ఆడటంతో టీ విరామ సమయానికి 215/2తో నిలిచింది. గిల్ 56 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. జైస్వాల్ 144 బంతుల్లో శతకం అందుకున్నాడు. ఇంగ్లాండ్ గడ్డపై ఆడిన తొలి ఇన్నింగ్స్‌లోనే శతకం బాదడం విశేషం. మూడో సెషన్ ఆరంభమైన కాసేపటికే జైస్వాల్ ఔటయ్యాడు. స్టోక్స్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో 129 పరుగుల భాగస్వామ్యానికి (163 బంతుల్లో) తెరపడింది. తర్వాత గిల్, పంత్ నిలకడగా ఆడారు. గిల్ 140 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. జోష్ టంగ్ వేసిన 74.2 ఓవర్‌కు ఫోర్ బాది మూడంకెల స్కోరు అందుకున్నాడు. నిలకడగా ఆడిన పంత్ 91 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. పంత్, గిల్ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రెండో రోజు కూడా భారత బ్యాటర్లు జోరు కొనసాగించి భారీ స్కోరు చేస్తే మ్యాచ్‌పై టీమ్ఇండియా పట్టుబిగించడం ఖాయం.



# దేశానికి ఆడకుంటే... ఇచ్చిన ప్రోత్సాహకాల్ని తిరిగి రాబడతాం

**భారత టెన్నిస్ ఆటగాళ్లకు 'సాయ్' స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ ఆటగాళ్లు దేశం తరపున ఆడకపోతే ప్రోత్సాహకాల్ని తిరిగి రాబడతామని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) స్పష్టం చేసింది. కొంతకాలంగా పేరొందిన ఆటగాళ్లు దేశాన్ని విస్మరించి ఏటీపీ టోర్నీలకే ప్రాధాన్యమివ్వడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'సాయ్'... ఆటగాళ్లలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పథకాలు, ప్రోత్సాహకాల రూపేణా ఆర్థిక సాయం పొందిన ఆటగాళ్లు సహేతుక కారణాలు లేకుండా దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు నిరాకరిస్తే ఇచ్చిన మొత్తాన్ని వెనక్కి తీసుకుంటామని ప్రకటించింది. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) ఎప్పటి నుంచో అమలవుతున్నప్పటికీ... ప్రత్యేకంగా ఆసియా క్రీడల్లో పతకాలే లక్ష్యంగా టార్గెట్ ఆసియా క్రీడల గ్రూప్ (టీఏజీజీ) పథకాన్ని కొత్తగా ఈ ఏడాదే తీసుకొచ్చింది. దీనికింద పలువురు ప్లేయర్లకు విదేశీ కోచ్‌లతో శిక్షణ, విదేశీ పర్యటనల కోసం భారత్ నిధులు మంజూరు చేస్తోంది. ఇలా పథకాలతో ఆర్థికసాయం, ప్రోత్సాహకాలు పొందిన ఆటగాళ్లు దేశానికి ప్రాతినిధ్యం వహించాలంటే మాత్రం ముఖం చాటేస్తున్నారు. భారత మేటి సింగిల్స్ ఆటగాడు సుమిత్ నగాల్ డేవిస్ కప్ ఆడేందుకు అదేపనిగా ససేమిరా అంటున్నాడు.

గతేడాది పాకిస్తాన్, స్వీడన్... ఈ ఏడాది టోగోతో డేవిస్ కప్ మ్యాచ్‌లు ఆడకుండా తప్పించుకున్నాడు. ఇలాగే శశికుమార్ ముకుంద్, యూకీ బాంబ్రీలు కూడా డేవిస్ కప్ పోటీలపై అనాసక్తి కనబరుస్తున్నారు. కానీ ఏటీపీ, గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడేందుకు మాత్రం ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ ముగ్గురితో పాటు రాంకుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, సాకేత్ మైనేని, రిత్విక్ బొల్లిపల్లి, మహిళా ప్లేయర్లు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి, వైదేహి చౌధరీ, రుతుజా, మాయా రాజేశ్వరన్‌లకు టీఏజీజీ కింద ఆర్థిక అండదండలు లభిస్తున్నాయి. 'సాయ్' తాజా నిర్ణయాన్ని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) సహా డేవిస్ కప్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్, బిల్లీ జీన్ కింగ్ కప్ కెప్టెన్ విశాల్ ఉప్పల్ స్వాగతించారు.

# భారత్ నుంచి ఒక్క ప్లేయరే.. ఆ జట్టుతోనే జెమీమా! లిస్ట్ ఇదే..



భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు జెమీమా రోడ్రిగ్స్‌ను మహిళల బిగ్ బాష్ లీగ్ ఫ్రాంచైజీ బ్రిస్బేన్ హీట్ తిరిగి తీసుకుంది. ఈ ఏడాది జరగనున్న డబ్ల్యూబీబీఎల్ 10వ సీజన్ కోసం భారత్ నుంచి 15 మంది ప్లేయర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు ఒక్క జెమీమా మాత్రమే తిరిగి బీబీఎల్‌లో ఆడటం ఖరారైంది. కాగా గురువారం జరిగిన ప్లేయర్ల డ్రాఫ్టింగ్‌లో లీగ్‌లోని మొత్తం 8 ఫ్రాంఛైజీలు 23 మంది అంతర్జాతీయ ప్లేయర్లను ఎంపిక చేసుకున్నాయి. జెమీమా రోడ్రిగ్స్‌తో పాటు చినెల్లి హెన్రీ (వెస్టిండీస్), డి క్లెర్క్ (దక్షిణాఫ్రికా)ను బ్రిస్బేన్ ఫ్రాంచైజీ ఎంపిక చేసుకుంది. 'అభిమానులను ఆకట్టుకోగల సత్తా జెమీమాకు ఉంది' అని బ్రిస్బేన్ హీట్ యాజమాన్యం వ్యాఖ్యానించింది. జెమీమాకిది నాలుగో బిగ్‌బాష్ లీగ్ సీజన్ కానుంది. 2021-2022 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తరఫున... 2022-2023 సీజన్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున... 2024-2025 సీజన్‌లో బ్రిస్బేన్ హీట్ తరఫున జెమీమా ఆడింది. ఓవరాల్‌గా బిగ్‌బాష్ లీగ్‌లో జెమీమా 30 మ్యాచ్‌లు ఆడి 644 పరుగులు చేసింది. ఇందులో మూడు అర్ధ సెంచరీలున్నాయి. మరోవైపు..శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు, షబ్నమ్ ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా), హీథర్ నైట్ (ఇంగ్లండ్)ను సిడ్నీ థండర్ జట్టు తీసుకుంది. సోఫియా డంక్లీ, మ్యాడీ విలియర్స్ (ఇంగ్లండ్), అమేలియా కెర్ (న్యూజిలాండ్)ను సిడ్నీ సిక్సర్స్ జట్టు తీసుకుంది. సోఫీ ఎకిల్‌స్టోన్, టామీ బ్యూమాంట్ (ఇంగ్లండ్), లౌరా వాల్వర్డ్ (దక్షిణాఫ్రికా)ను అడిలైడ్ స్ట్రయికర్స్ ఎంపిక చేసుకోగా... అమీ జోన్స్, డానీ గిబ్సన్ (ఇంగ్లండ్), మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా)ను మెల్‌బోర్న్ స్టార్స్ జట్టు ఎంపిక చేసుకుంది. సోఫీ డివైన్ (న్యూజిలాండ్), స్కోల్‌ఫీల్డ్ (ఇంగ్లండ్), ఛ్లో ట్రియాన్ (దక్షిణాఫ్రికా) పెర్ స్కోచెర్స్ జట్టుకు ఎంపికయ్యారు. ఇక డానియల్ వ్యాట్, లినెస్సీ స్మిత్ హోబర్ట్ హరికేన్స్‌కు ప్రాతినిధ్యం వహించనుండగా... మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తరఫున డియాండ్రా డాటిన్, అలీస్ కాప్సీ బరిలోకి దిగనున్నారు.

# నెదర్లాండ్స్, స్లొవేనియాలతో భారత్ ఢీ

**బిల్లీ జీన్ కింగ్ కప్‌ప్లే ఆఫ్స్ 'డ్రా' విడుదల**

**బెంగళూరులో నవంబర్ 14 నుంచి 16 వరకు టోర్నీ**

**విజేత జట్టు 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత**




**బెంగళూరు:** ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ వరల్డ్ టీమ్ మహిళల టెన్నిస్ టోర్నమెంట్ ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి 16 వరకు బెంగళూరులోని ఎస్ఎం కృష్ణ టెన్నిస్ స్టేడియంలో ఈ టోర్నీ జరగనుంది. భారత్‌తోపాటు ఇతర దేశాల్లో ఇవే తేదీల్లో ఇతర గ్రూప్‌ల ప్లే ఆఫ్స్ టోర్నీలను నిర్వహిస్తారు. 'ప్లే ఆఫ్స్'కు మొత్తం 21 జట్లు అర్హత పొందాయి. 21 జట్లను ఏడు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో మూడు జట్లకు చోటు కల్పించారు. గ్రూప్ విజేతగా నిలిచే ఏడు జట్లు వచ్చే ఏడాది బిల్లీ జీన్ కింగ్ కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తాయి. 2021 తర్వాత వరల్డ్ గ్రూప్ 'ప్లే ఆఫ్స్'కు అర్హత పొందిన భారత జట్టుకు గ్రూప్ 'జి'లో చోటు దక్కింది. గ్రూప్ 'జి'లోనే నెదర్లాండ్స్, స్లొవేనియా జట్లు కూడా ఉన్నాయి. వచ్చే ఏడాది వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించాలంటే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాల్సి ఉంటుంది. పుణేలో ఇటీవల జరిగిన ఆసియా జోన్ క్వాలిఫయర్స్ టోర్నీలో టాప్-2లో నిలవడం ద్వారా భారత్, న్యూజిలాండ్ జట్లు 'ప్లే ఆఫ్స్' టోర్నీకి అర్హత పొందాయి. హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక అద్భుత ఆటతీరు కనబరిచి తాను ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి భారత్ విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. రష్మికతోపాటు సహజ యామలపల్లి, అంకిత రైనా, వైదేహి, ప్రార్థన, మాయా రాజేశ్వరన్ జట్టులో ఇతర సభ్యులుగా ఉన్నారు.

**గట్టిపోటీ తప్పదు...**

వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు తొలిసారి అర్హత పొందాలంటే భారత్ విశేషంగా రాణించాల్సి ఉంటుంది. భారత్ ప్రత్యర్థులుగా ఉన్న నెదర్లాండ్స్, స్లొవేనియాలతో పోలిస్తే టీమిండియా నుంచి ఒక్కరు కూడా టాప్-300 ర్యాంకింగ్స్‌లో లేకపోవడం గమనార్హం. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తాజా సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి శ్రీవల్లి రష్మిక (322), సహజ (342), అంకిత రైనా (347), వైదేహి (368) మాత్రమే టాప్-400లో ఉన్నారు. డబుల్స్‌లో మాత్రం భారత్ నుంచి ఇద్దరు టాప్-200లో ఉన్నారు. ప్రార్థన తొంబారే 145వ ర్యాంక్‌లో, అంకిత రైనా 190వ ర్యాంక్‌లో ఉన్నారు. నెదర్లాండ్స్ జట్టులో సింగిల్స్ విభాగంలో టాప్-100లో ఇద్దరు సుజాన్ లామెన్స్ (70), అరంటా రుస్ (91)... డబుల్స్‌లో టాప్-100లో ఇద్దరు డెమీ షుర్స్ (18), ఇసాబెల్లి హవెర్లాగ్ (91) ఉన్నారు. స్లొవేనియా జట్టులో సింగిల్స్ విభాగంలో టాప్-250లో ఇద్దరు వెరోనికా ఎర్జావెక్ (172), తమారా జిదాన్‌సెక్ (206)... డబుల్స్‌లో టాప్-300లో ఇద్దరు కాజా జువాన్ (259), ఇవా ఫాల్‌క్‌నర్ (219) ఉన్నారు.

**బిల్లీ జీన్ కింగ్ కప్ వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ గ్రూప్ వివరాలు గ్రూప్ 'ఎ': కెనడా, డెన్మార్క్, మెక్సికో.**

**గ్రూప్ 'బి': పోలాండ్, రుమేనియా, న్యూజిలాండ్.**

**గ్రూప్ 'సి': స్లొవేకియా, స్విట్జర్లాండ్, అర్జెంటీనా.**

**గ్రూప్ 'డి': చెక్ రిపబ్లిక్, కొలంబియా, క్రొయేషియా.**

**గ్రూప్ 'ఇ': ఆస్ట్రేలియా, బ్రెజిల్, పోర్చుగల్.**

**గ్రూప్ 'ఎఫ్': జర్మనీ, బెల్జియం, తుర్కియే.**

**గ్రూప్ 'జి': నెదర్లాండ్స్, స్లొవేనియా, భారత్.**